సాక్షి
తిరుపతి
సోమవారం । 8 । మే । 2023



ముక్కలైన కార్మికుడి శరీరం

బ్రేక్ ఇండియా పరిశ్రమలో పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడి శరీరం ముక్కలైంది. - 8లో



నీట్ ప్రశాంతం

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని 12 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ ప్రశాంతంగా ముగిసింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	36	25
తిరుమల	32	22
గూడూరు	38	27
నగరి	37	26

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూ కాంప్లెక్స్‌ల్లోని 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధ రాత్రి వరకు 76,392 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,248 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.83 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

2 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. దీనికి సంబంధించిన టైం టేబుల్‌ను త్వరలోనే విద్యాశాఖ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి హాజరవ్వాలనుకునే విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలను ఎదురుచూడకుండా నిర్ణీత గడువులోపు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 7నుంచి 17వ తేదీ వరకు లేట్ ఫీ లేకుండా, 18నుంచి 22వ తేదీలోపు రూ.50 అదనంగా లేట్ ఫీజుతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఐఐటీలో కలెక్టర్ పర్యటన



ఐఐటీలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ఏర్పేడు: మండలంలో ఉన్న ఐఐటీ తిరుపతి, జంగాలపల్లి వద్ద ఉన్న ఐసర్‌లో ఆదివారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి పర్యటించారు. త్వరలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఐఐటీ, ఐసర్‌ను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఐఐటీ, ఐసర్‌లో మూడు ప్రదేశాల్లో మూడు హెలిప్యాడ్‌ల ఏర్పాటుకు స్థలాలు పరిశీలించారు. స్టేజీ, భద్రతపై సంబంధిత అధికారులతో చర్చించారు. త్వరలో ఎస్పీజీ సెక్యూరిటీ సిబ్బంది రానున్నట్లు వివరించారు. వారు సూచించిన అనుకూల ప్రాంతాలల్లో హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, అదనపు ఎస్పీ కులశేఖర్, డీఆర్వో శ్రీనివాస రావు, ఆర్అండ్‌బీ ఈఈ సుధాకర్‌రెడ్డి, తహసీల్దారు ఉదయ్ సంతోష్ ఆయన వెంట ఉన్నారు.

16న అఖండ పారాయణం

తిరుమల: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మే 16వ తేదీ తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 5.50 నుంచి రాత్రి 10.30 వరకు దాదాపు 16 గంటల పాటు 67 మంది ప్రముఖ పండితులు ఈ అఖండ పారాయణ యజ్ఞాన్ని కొనసాగిస్తారు. హనుమంతుడు సీతాన్వేషణ కోసం లంకకు వెళ్లి సీతమ్మ జాడ తెలుసుకుని శ్రీరామచంద్రునికి తెలియజేసే పూర్తి ఘట్టంలోని సుమారు 2,900 శ్లోకాలను పండితులు పారాయణం చేస్తారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వ విద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

నేటి నుంచి వేసవి శిబిరాలు

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రాంతీయ తిరుపతి గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు ఉచితంగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి సూర్యనారాయణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని వివరించారు. కథలు వినడం, నచ్చిన పుస్తకాలు చదవడం, కథలపై విశ్లేషణ, కథలు చెప్పడం, స్పోకన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్‌పై శిక్షణ ఉంటుందని వివరించారు. వివరాల కోసం 90002 37312, 83176 51455ను సంప్రదించాలని కోరారు.

మణిపూర్‌లో చిత్తూరు విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: మణిపూర్‌లో వివిధ యూనివర్సిటీల్లో చదివేందుకు వెళ్లిన చిత్తూరు జిల్లాకు చెందిన ఆరుగురు అక్కడే చిక్కుకుపోయారు. అక్కడ చిక్కుకున్న విద్యార్థుల వివరాలు ఆదివారం కలెక్టరేట్‌కు వచ్చాయి. చిత్తూరు జిల్లాకు చెందిన అర్చన, చరణ్‌తేజ, పురుషోత్తంరెడ్డి, పవన్‌కల్యాణ్, వర్షిత్, సుజిత్ అక్కడే ఉన్నట్టు సమాచారం అందింది. వీరిని క్షేమంగా రప్పించేందుకు పాలక అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

పదింతల ఆనందం



శ్రీకాళహస్తి: తొండమనాడు స్కూల్లో ఉత్తమ మార్కులు సాధించిన ధృవితారెడ్డిని అభినందిస్తున్న టీచర్లు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా వ్యాప్తంగా ఏడు సర్కారు బడులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. కార్పొరేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాలు రావడంతో పేద విద్యార్థుల కుటుంబాల్లో ఆనందం పదింతలైంది. జిల్లా వ్యాప్తంగా ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ 91 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించిన అగ్ర స్థానంలో నిలిచాయి. అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ బడుల విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాలలు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
ఎయిడెడ్	571	72.92
బీసీ వెల్ఫేర్	332	84.69
ప్రభుత్వ	442	53.71
కేజీబీవీ	106	64.63
మున్సిపల్	581	58.51
ఏపీ మోడల్ పాఠశాలలు	297	75.38
రెసిడెన్షియల్	144	91.72
సోషల్‌వెల్ఫేర్	693	82.60
ట్రై బల్ వెల్ఫేర్	297	65.13
జిల్లా పరిషత్	6753	62.04
మొత్తం	10216	64.31

- సత్తా చాటిన సర్కారు పాఠశాలలు
- 7 బడుల్లో 100 శాతం ఉత్తీర్ణత
- ఏపీ రెసిడెన్షియల్‌లో 91.72 శాతం ఉత్తీర్ణత
- బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో 84.69 శాతం ఉత్తీర్ణత

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థులకు ఇచ్చే అతి పెద్ద ఆస్తి చదువు ఒక్కటే అని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తరచూ చెబుతున్నారు. పిల్లలకు మంచి చదువు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి విద్యారంగంలో సంచలనాత్మక మార్పులు తీసుకొచ్చారు. నాడు-నేడుతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి సరికొత్త వైభవం తీసుకొచ్చారు. కార్పొరేట్ విద్యనందించాలనే లక్ష్యంతో ఇంగ్లీష్ మీడియం, జగనన్న విద్యాకానుకలను సకాలంలో అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా నాణ్యమైన విద్యనందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు.

ప్రభుత్వ ఆశయాలను విద్యాశాఖ అమలుచేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తోంది. విద్యాశాఖాధికారులు ప్రణాళికలు రూపొందించి పటిష్టంగా అమలుచేయడంతో ఈ ఏడాది అత్యధిక శాతం మంది ఉత్తీర్ణత సాధించడమే కాకుండా కార్పొరేట్‌కు దీటుగా అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు.

ఏడు పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

పది పరీక్షా ఫలితాల్లో తిరుపతి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో శ్రీకాళహస్తిలోని ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్సీ, కోట చిట్టేడులోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్(బాలురు), చెల్లమాంబపురంలోని జెడ్పీ హైస్కూల్(తమిళ్), చియ్యవరం, పరమాల, బండారుపల్లె, ఉస్తికాయలపెంటలోని జెడ్పీ హైస్కూల్స్ విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకున్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా దాదాపు 340 ప్రభుత్వ పాఠశాలల నుంచి పరీక్షకు హాజరైన 15,701మంది విద్యార్థులకు 10,216 (64.31శాతం) ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు.



వరదయ్యపాళెం: అత్యధిక మార్కులు సాధించిన పద్మావతి, భరత్‌కుమార్‌కు సన్మానం

మొదటి క్లాస్‌లో 6518 మంది

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల్లో 6,518 మంది మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ శ్రేణిలో 2466 మంది, తృతీయ శ్రేణిలో 1232 మంది ఫలితాలు సాధించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

12 బడుల్లో అత్యుత్తమ మార్కులు

జిల్లా వ్యాప్తంగా 12 పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. తొండమనాడు పాఠశాలలో చెవిరెడ్డి ధృవితరెడ్డి (శ్రీకాళహస్తి), చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలకు చెందిన యోగేశ్వర్, గణేష్‌నాయక్, నారాయణవనం బాలుర పాఠశాలకు చెందిన షణ్ముగానందన్, తడ మండలం చినమంబట్టు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జనని, శ్రీకాళహస్తి బాలికల జెడ్పీహైస్కూల్‌కు చెందిన బేబిశ్రీ, పావని, పూజిత, వరదయ్యపాళెం మండలం కారెపాకం జెడ్పీహైస్కూల్‌కు చెందిన భరత్‌కుమార్, వెంకటగిరి ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన సజ్జ పోతులూరు, వెంకటగిరి జెడ్పీ బాలుర పాఠశాలకు చెందిన జాషువ, గూడూరు మండలంలోని చెన్నూరు బాలికల పాఠశాలకు చెందిన నవ్యశ్రీ, పల్లం జెడ్పీహైస్కూల్‌కు చెందిన భాను ప్రకాష్‌రెడ్డి అత్యుత్తమ మార్కులు సాధించారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

పది ఫలితాలతో కరపత్రాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఫొటోలతో ప్రచురించిన కర పత్రాలను శనివారం ప్రధానోపాధ్యాయులు రమణయ్య గ్రామాల్లో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందున పల్లెల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కరపత్రాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, అమ్మ ఒడి, మనబడి, నాడు-నేడు, ట్యాబ్‌లతో బైజూస్ పాఠాలు వంటి అంశాలున్నాయన్నారు.



శ్రీకాళహస్తి గురుకులం ప్రతిభ

పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటారు. మొత్తం 77 మంది విద్యార్థినులకుగాను 68 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 16 మంది విద్యార్థినులు 500కుపైగా మార్కులు సాధించినట్టు ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను ఆమె అభినందించారు.

భక్తజనసంద్రంగా బోయకొండ



ప్రత్యేకాలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రద్దీ సాగింది. వేకువజామున గంగమ్మకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం ఉచిత దర్శనం, కుంకుమార్చన, ప్రత్యేక దర్శనం క్యూలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. పదోతరగతి ఫలితాలు వెలువడడంతో ఆదివారం, అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. కోర్కెలు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా హాజరై మొక్కులు చెల్లించారు. భక్తులు త్వరితగతిన అమ్మవారి దర్శనం చేసుకునేలా ఆలయ ఈఓ చంద్రమౌళి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ఆలయంలో భక్తుల రద్దీ

సర్వభూపాల వాహన సేవలో వేదనారాయణ స్వామి



సర్వభూపాల వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణ స్వామి

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణ స్వామి సర్వభూపాల వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేదనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి నిత్య కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు వేదనారాయణుడిని కల్పవృక్ష వాహనంపై ఆసీనులు చేశారు. నాగలాపురంలో కల్పవృక్ష వాహన సేవ భక్తుల గోవిందనామ స్మరణలు, కోలాట ప్రదర్శనల నడుమ వేడుకగా జరిగింది. అనంతరం సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం ఊయల సేవ నిర్వహించారు. వాహన మండపంలో సిద్ధంగా ఉన్న సర్వభూపాల వాహనంపై స్వామి, అమ్మవార్లను అర్చకులు ఆసీనులు చేయగా.. పరిచారికల సేవల నడుమ స్వామి తిరువీధుల్లో భక్తుల కర్పూర నీరాజనాలు అందుకుంటూ విహరించడం కనువిందు చేసింది. చివరగా నిజాలయానికి స్వామివారు చేరి ఏకాంతసేవలో పవళించారు. సోమవారం ఉదయం మోహినీ అవతారంలో స్వామివారు పురవీధుల్లో విహరిస్తారని, రాత్రి గరుడవాహన సేవను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను టీటీడీ ఏఈఓ మోహన్ , టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పర్యవేక్షించారు.

అభివృద్ధి పథంలో ఆధ్యాత్మిక నగరి

- ధర్మం-అభివృద్ధి సమపాళ్లలో అమలు
- ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి
- కంచి పీఠాధిపతి చేతుల మీదుగా రహదారుల ప్రారంభం



కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక నగరిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతీ చేతుల మీదుగా ఆదివారం రెండు రహదారుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి మార్గం (80 అడుగులు) తొండమాన్ చక్రవర్తి మార్గం (60) ను తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్‌తో కలిసి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కంచి స్వామితో కలిసి మాస్టర్ ప్లాన్ రోడ్లను బ్యాటరీ వాహనంలో వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ దివ్య క్షేత్రంలో ధర్మం, అభివృద్ధిని సమపాళ్లలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో వందలాది కోట్ల రూపాయలు వెచ్చించి, నగరాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నామన్నారు. రహదారుల నిర్మాణంతో తిరుపతికి కొత్త శకం మొదలైందని చెప్పారు. తిరుపతి అనతి కాలంలోనే 14 మాస్టర్ ప్లాన్ రోడ్లతో అమాంతంగా విస్తరించనుందని వివరించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లకు దివ్య పురుషులు, శ్రీవారి తొలి సేవకుల పేర్లు పెట్టడంతో తిరుపతికి మరింత ఆధ్యాత్మికత చేకూరిందన్నారు. నూతన రహదారులకు శ్రీవారికి సేవలందించిన మహానుభావుల పేర్లను పెడతామని చెప్పారు.

మా గురువుకు సముచిత స్థానం

తిరుపతి నగరంలో పరమాచార్య శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామి పేరుతో రోడ్డుకు నామకరణం చేయడంతో మా గురువుకు సముచిత స్థానం లభించిందని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. మేయర్ శిరీష మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ 50 ఏళ్ల అవసరాలకు సరిపోయే అభివృద్ధిని తాము చేపట్టామన్నారు. కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ ఉమాఅజయ్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, నరసింహాచారి, కార్పొరేటర్లు అమరనాథ్ రెడ్డి, నరేంద్ర, ఆంజినేయులు, శేఖర్ రెడ్డి, హనుమంత్ నాయక్, మోహన్ కృష్ణ, తిరుత్తణి శైలజ, దూదికుమారి, కోటేశ్వరమ్మ, ఆదిలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు ఇమామ్ షాహెబ్, రుద్రరాజు శ్రీదేవి, అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, డీసీ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎం.ఈ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, డీఈ విజయ్ కుమార్ రెడ్డి, కాంట్రాక్టర్లు జనార్దన్ రెడ్డి, వెంకటముని రెడ్డి, సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదలకు ఆర్థిక భరోసా

- వచ్చే ఎన్నికల్లోనూ అండగా నిలుద్దాం
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప సంఘీభావం
- మహా పాదయాత్రకు విశేష స్పందన



బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, మోహిత్‌రెడ్డి



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట : జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీలో గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ యాత్రకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాకతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా జేజేలు పలుకుతూ ఘనంగా స్వాగతం పలికారు. మోహిత్‌రెడ్డితో కలసి గడప గడపకు పర్యటించారు. ప్రతి గడపలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సమర్థ పాలనకు, అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజలను కోరారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని చెప్పారు. మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించి ఎమ్మెల్యేగా ఆదరించాలని ఎంపీ రెడ్డెప్ప విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు మరింత నమ్మకం కలిగించాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో సమస్యలు పరిష్కరించడంలో ప్రజలకు మరింత నమ్మకం కలిగించాలని మోహిత్‌రెడ్డి అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. పరిష్కరించలేని సమస్యలుంటే అర్జీదారులకు వివరించాలని చెప్పారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, సర్పంచ్ మాధవి, జెడ్పీటీసీ స్వరూప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరెడ్డి, మునిరామ్, ఉప సర్పంచ్ శివారెడ్డి, పంచాయతీ కన్వీనర్ రఘునాథరెడ్డి, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోకి వంద కుటుంబాలు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో వంద కుటుంబాలకు పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పాతవీరాపురం గ్రామంలోని శ్రీకాళహస్తి మునిరత్నం, సుబ్బారెడ్డి, తులసి, రాజశేఖర్, భూలక్ష్మి, రవి, కృష్ణారెడ్డి, మునిబత్తిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, కేశవులు, కుమారి తదితర వంద కుటుంబాలకు పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, సర్పంచ్ మంజుల, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, మాజీ ఎంపీటీసీలు మునిరత్నంరెడ్డి, రమణయ్య యాదవ్, దామోదరంరెడ్డి మునిరెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

క్లుప్తంగా

వందలాది మందికి విషజ్వరాలు



ఐసర్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరి

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న ఐసర్‌లో పారిశుద్ధ్యం లోపించడంతో భవన నిర్మాణ కార్మికులు విషజ్వరాల బారిన పడ్డారు. వివరాల్లోకి వెళితే, ఐసర్‌లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది ఇక్కడికి వచ్చి పనులు చేస్తున్నారు. ఇక్కడ మురుగు పేరుకుపోయి, పారిశుధ్యలోపంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ క్రమంలోనే వందలాది మంది కార్మికులు ఆస్పత్రుల పాలవడంతోపాటు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన కార్మికుడు సునీల్ కుమార్ మృతి చెందాడు. దీంతో రెండు రోజుల నుంచి ఈ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్యాధికారి శ్రీహరి ఆదివారం ఐసర్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

గంజాయి గ్యాంగ్ అరెస్టు

- 2.3 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి విక్రయిస్తున్న గ్యాంగ్‌ను అరెస్ట్ చూపుతున్న చంద్రగిరి సీఐ ఓబులేసు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

చంద్రగిరి(తిరుపతి రూరల్): పోలీసుల వలకు గంజాయి గ్యాంగ్ చిక్కింది. ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గంజాయిని తెచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్న ఆరుగురిని చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ ఓబులేసు విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో యువతకు పెద్ద ఎత్తున గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం చంద్రగిరి మండలం శానంబట్ల గ్రామం సమీపంలోని ఓ కళ్యాణ మండపం పక్కన ఏడుగురు యువకులు గుంపుగా ఉండడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. వారు పారిపోవడానికి ప్రయత్నించగా అందులో ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. కడప జిల్లా దువ్వూరు మండలం మాదిరెడ్డిపల్లెకి సంజయ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం బండపువారిపల్లికి చెందిన దొరబాబు రెడ్డి, మదనపల్లెకు చెందిన షేక్ హునష్, కలికిరి టౌన్‌కు చెందిన సత్య, చెన్నైకి చెందిన సతీష్, తిరుపతి రూరల్ మండలం తిరుమలనగర్‌కు చెందిన సంపత్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 2.3 కిలోల గంజాయి ప్యాకెట్లను, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారు. వీరికి గంజాయి విక్రయించిన తిరుపతికి చెందిన రియాజ్, నెల్లూరుకు చెందిన శ్యాముల్ కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు చెప్పారు. బయటి వ్యక్తులు వచ్చి చంద్రగిరిలో గంజాయి విక్రయిస్తున్నారని, దీనిపై సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐలు వంశీధర్, హిమబిందు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,810
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,641

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,300
రిటైల్ వెండి గ్రాము	రూ.80.30

కానిస్టేబుల్‌పై దాడి

కోట: మండలంలోని చిట్టేడుకు చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన కొందరు ఆదివారం దాడికి పాల్పడ్డారు. వెంకటేశ్వర్లు గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. చిట్టేడులో మోటార్‌బైక్‌పై వెళ్తుండగా పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన వెంకటేష్, శ్రీనివాసులు దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. బీరుసీసాతో తలపై కొట్టడంతో తీవ్రగాయమైంది. గాయపడిన వెంకటేశ్వర్లు కోట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

వాహనం ఢీకొని దుప్పి మృతి



మృతి చెందిన దుప్పిని పరిశీలిస్తున్న అటవీ అధికారి

ఓజిలి: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో చుక్కల దుప్పి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. దాహార్తిని తీర్చుకునేందుకు అటవీప్రాంతం నుంచి ఓజిలి మండల రాజుపాళెం చెరువు వద్దకు దుప్పి వస్తుండగా, వాహనం ఢీకొని వెళ్లిపోయింది. అక్కడికక్కడే మృతి చెందిన దుప్పిని హైవే మొబైల్ పోలీసులు గుర్తించి అటవీ అధికారులకు తెలియజేశారు. దీంతో అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని దుప్పికి శవ పంచనామా చేసి పూడ్చివేసినట్లు తెలిపారు.

ముక్కలైన కార్మికుడి శరీరం

- బ్రేక్స్ ఇండియా పరిశ్రమలో కార్మికుడి మృతి



పరిశ్రమలో యంత్రాన్ని పరిశీలిస్తున్న సీఐ నరసింహారావు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని మేనకూరు సెజ్‌లో ఉన్న టీవీఎస్ బ్రేక్స్ ఇండియా పరిశ్రమలో పనిచేస్తున్న జార్ఖండ్ ప్రాంతానికి చెందిన కార్మికుడు పవన్ బాద్వజ్(19) శనివారం అర్ధరాత్రి దుర్మరణం చెందాడు. పరిశ్రమలో ఇసుకను వేడి చేసే యంత్రాన్ని శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా సెన్సర్ బటన్ ఆన్ అయిపోవడంతో మిషిన్ స్టార్ట్ అయిపోయింది. పెద్ద ఫ్యాన్ వేగంగా తిరగడంతో అందులో ఉన్న కార్మికుడు పవన్ శరీరం ముక్కలైపోయి మృతి చెందాడు. ఈ సంఘటనపై పరిశ్రమ మేనేజర్ అరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ నరసింహారావు కేసు నమోదు చేశారు. సీఐ ఆదివారం పరిశ్రమ వద్దకు వెళ్లి క్షుణంగా పరిశీలన చేశారు. పవన్ శరీర భాగాలను అతికించి ఆదివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేసి, మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో జార్ఖండ్ ప్రాంతానికి తరలించారు.

చెక్కల దుకాణంలో అగ్నిప్రమాదం

తిరుపతి క్రైమ్: నగరంలోని పెద్ద కాపు వీధిలో చెక్కల దుకాణంలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు తిరుపతి ఫైర్ అధికారులు తెలిపారు. తుడా రోడ్డులోని సంకల్ప హాస్పిటల్ వెనుక భాగంలో ఉన్న నందకుమార్ కార్పెంటర్ షాపులో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.6లక్షలు విలువ చేసే చెక్కలు, మిషనరీలు కాలిపోయినట్లు తెలిపారు.



చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి



మృతి చెందిన రమణయ్య

గూడూరురూరల్: మండలంలోని మేగనూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు, గీత కార్మికుడు జడపల్లి రమణయ్య (49) సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా కాలు జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

పేకాట స్థావరాలపై దాడులు

వెంకటగిరిరూరల్: పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసకున్నారు. ఎస్ఐ జిలాని కథనం మేరకు, మండలంలోని చింతగుంట శివారుల్లో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. ముగ్గురిని పట్టుకుని, రూ.11020 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇష్టంలేని పెళ్లి చేస్తారేమోనని..!

- ఇద్దరు యువతుల ఆత్మహత్యాయత్నం
- వరుసకు ఇద్దరూ అక్కాచెల్లెళ్లే
- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం





రజిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆదిలక్ష్మి, మృతి చెందిన రజిత

నాయుడుపేటటౌన్: తమకు ఇష్టంలేని పెళ్లి చేస్తారేమోనని వరుసకు అక్కాచెల్లెళ్లైన ఇద్దరు యువతులు ఆదివారం కూల్‌డ్రింక్‌లో విషపుగుళికలు కలుపుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. వీరిలో ఒకరు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన మండలంలోని తిమ్మాజికండ్రిగ గ్రామంలోని స్వర్ణముఖి నది కాజ్ వద్ద చోటు చేసుకుంది. నాయుడుపేట సీఐ నరసింహారావు తెలిపిన వివరాల మేరకు.. ఓజిలి మండల, కొత్తపేట గ్రామానికి చెందిన ముమ్మడి సుబ్బయ్య, కస్తూరమ్మకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సుప్రియకు వివాహంకాగా రెండో కుమార్తె రజిత నాయుడుపేట పట్టణంలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతూ... కొత్తపేటలో వలంటీర్‌గా పనిచేస్తోంది. ఇదిలావుండగా.. కొత్తపేట మాజీ సర్పంచ్ బట్టా సురేష్, వీరమ్మ దంపతులకు కుమారుడు పూర్ణచంద్ర, కుమార్తె నీరజ ఉన్నారు. నీరజ బీటెక్ చదివి ఇంట్లోనే ఉంటోంది. రజిత, నీరజ ఇద్దరూ చిన్నమ్మ, పెద్దమ్మ పిల్లలు. వరుసకు అక్కాచెల్లెళ్లు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు పెళ్లి చేయాలని వీరికి సంబంధాలు చూస్తున్నారు. తమకు ఇష్టం లేని పెళ్లి చేస్తారేమోనని అక్కాచెల్లెళ్లు క్షణికావేశానికి లోనయ్యారు. ఆదివారం స్కూటీ డ్రైవింగ్ నేర్చుకుంటామని చెప్పి నాయుడుపేట వైపు వచ్చారు. వారి వెంట విషపు గుళికలు ఉన్న డబ్బాతోపాటు కూల్‌డ్రింక్ తెచ్చుకున్నారు. తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది కాజ్ వే వద్ద ఇద్దరు కూల్‌డ్రింక్‌లో విషపు గుళికలు కలుపుకుని సేవించి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. వారు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అప్పటికే స్వర్ణముఖి కాజ్ వే సమీపంలో అపస్మారకస్థితిలో పడి ఉన్న ఇద్దరు యువతులను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు అందించారు. చికిత్స పొందుతూ రజిత(21) మృతువాత పడింది. నీరజ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. రజిత మృతి పట్ల ఓజిలి ఎస్ఐ ఆదిలక్ష్మి విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు.



చికిత్స పొందుతున్న నీరజ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన మురళీకృష్ణ

బంగారుపాళెం: మండలంలోని గుర్రంకొండవాండ్లఊరు వద్ద బంగారుపాళెం-రాగిమాను పెంట రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిడివికండ్రిగకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ గజేంద్ర కథనం.. నలగాంపల్లె పంచాయతీ పాపుదేశికండ్రిగకు చెందిన ఎన్‌పీ మురళీకృష్ణ(52) సొంతపని నిమిత్తం తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో గుర్రంకొండవాండ్ల ఊరు సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న టాటాఏస్(పాల వాహనం) ఢీ కొంది. ఈ ప్రమాదంలో మురళీకృష్ణ తలకు బలమైన గాయం తగలడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ బస్సులకు దూకుడెక్కువ

- చెయ్యెత్తినా ఆగని సూళ్లూరుపేట బస్సులు
- తీవ్ర అసహనంలో ప్రయాణికులు
- రాబడిలో సూళ్లూరుపేట డిపో చివరిస్థానం



తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలోనే సూళ్లూరు డిపో ప్రయాణికులకు సేవలందించడంలోనూ రాబడిలోనూ చివరి స్థానంలో ఉంది. ఈ డిపో బస్సులకు దూకుడెక్కువ స్టాపింగులు తక్కువ కావడం మరో కారణం. జిల్లా వ్యాప్తంగా 11 డిపోలున్నాయి. 814 బస్సులు నడుస్తున్నాయి. అయితే సూళ్లూరుపేట డిపో బస్సులకు ఒక ప్రత్యేకత ఉంది. అత్యంత వేగంగా వెళతాయని ఎక్కువ మంది ప్రయాణికులు బస్సుల పట్ల ఆసక్తి చూపుతుంటారు. అయితే కొంతకాలంగా ఆ డిపోకు చెందిన బస్సులు స్టాపింగ్ ఉన్నా, ప్రయాణికులు ఆపినా ఆపడం లేదు. దీంతో ప్రయాణికులు ఆ బస్సుల్లో ప్రయాణించడం లేదు. సూళ్లూరుపేట నుంచి శ్రీకాళహస్తి మీదుగా తిరుపతికి పలు సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. శ్రీకాళహస్తి నుంచి ప్రయాణికులు తిరుపతికి అధిక సంఖ్యలోనే వస్తుంటారు. అయితే శ్రీకాళహస్తి బస్టాండ్‌లో నిలిచిన తర్వాత పట్టణంలోని పాత వీఎంసీ సర్కిల్, జయరామరావు సర్కిల్, కొండమిట్ట సర్కిల్, దేవస్థానం, సూపర్ బజార్, స్వర్ణముఖినది బస్టాండ్, శ్రీరామనగర్‌కాలనీ, పొన్నాలమ్మ సర్కిల్, ఏపీ సీడ్స్ సర్కిల్, పానగల్, రైల్వే స్టేషన్ ఈ ప్రాంతాల్లో ప్రయాణికులు ప్రతి స్టాపింగ్‌లోను తిరుపతికి రావడానికి నిరీక్షిస్తుంటారు. ఈ స్టాపింగ్స్‌లో అన్ని డిపోలకు చెందిన సర్వీసులు ఆగుతుంటాయి. అయితే సూళ్లూరుపేటకు చెందిన బస్సులు మాత్రం బస్టాండ్ తర్వాత మిగిలిన స్టాపింగ్‌ల్లో నిలపడం లేదు. ఫలితంగా ఆదాయంలో ఈ డిపో జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది.

2022-23లో ఆదాయార్జనలో రాష్ట్రంలో తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. రోజుకు రూ.1.5 కోట్ల మేరకు ఆదాయం వస్తోంది. ఏడాదిలో తిరుపతి జిల్లా రాబడి (2022 ఏప్రిల్ 1-మార్చి 31)లో రూ.565 కోట్లు. అయితే తిరుమల డిపో రూ.91.08 కోట్లతో జిల్లాలో ప్రథమ స్థానంలోను, తిరుపతి డిపో రూ.83.60కోట్లతో రెండో స్థానంలోను, మంగళం డిపో రూ.69.61కోట్లతో మూడో స్థానంలో నిలిచింది. అయితే సూళ్లూరుపేట డిపో రూ.22.12 కోట్లతో జిల్లాలో చివరి స్థానానికి పడిపోయింది.

విచారించి చర్యలు తీసుకుంటాం

స్టాపింగ్ ఉన్న చోట, ప్రయాణికులు ఆపిన చోట డ్రైవర్లు బస్సును ఆపకుండా వెళ్లడం మంచిపద్ధతి కాదు. ఆ మేరకు సూళ్లూరుపేట సర్వీసులకు సంబంధించి విచారణ చేపడతాం. బస్సులో సీట్లు లేకపోయినా ప్రయాణికులు చెయ్యెత్తితే ఆపాల్సిందే. దీనిపై సూళ్లూరుపేట డిపో మేనేజర్‌కు ఆదేశాలు ఇచ్చాం.

- చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, తిరుపతి

పరీక్ష కేంద్రంలోకి క్యూలో వెళుతున్న విద్యార్థులు



వేలిముద్రలు, ఫొటోలు తీసుకుంటున్న పర్యవేక్షకులు



నీట్ ప్రశాంతం

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన నీట్ ప్రశాంతంగా ముగిసింది. తిరుపతిలో 9, చిత్తూరులో 3 మొత్తం 12 పరీక్ష కేంద్రాల్లో నీట్ ను ఎన్‌టీఏ ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించింది. ఆయా పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచే విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వీరిని నిబంధనలకు అనుగుణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. తిరుపతిలోని 9 పరీక్ష కేంద్రాల్లో 5,260మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా వీరిలో 111మంది గైర్హాజరైనట్లు నీట్ కోఆర్డినేటర్ సింధు తెలిపారు. చిత్తూరులో ఏర్పాటు చేసిన 3 పరీక్షా కేంద్రాల్లో 912 మందికిగాను 29 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

- తిరుపతి ఎడ్యుకేషన్/చిత్తూరు కలెక్టరేట్



తనిఖీ చేస్తున్న సిబ్బంది



కాలి పట్టీ తీస్తున్న విద్యార్థిని